


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com




హైదరాబాద్ ఆదివారం 14-3-2021 RNI No.52865/93-Postal No\.H/SD/258/2018-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక: 190 పేజీలు: 4 వెల: రూ.1/-

# మళ్లీ విజృంభిస్తున్న కరోనా

## 64శాతం ఒక్క మహారాష్ట్రలోనే నమోదు

## అప్రమత్తంగా ఉండాలన్న ఆరోగ్య శాఖ

న్యూఢిల్లీ,మార్చి13(ఆర్ఎన్ఎ): దేశంలో కరోనా వైరస్ మహమ్మారి ఉధృతి కొనసాగుతోంది. ఇప్పటికే గడిచిన వారం రోజుల్లోనే దేశవ్యాప్తంగా లక్ష మందికి పైగా కరోనా బారిన పడ్డారు. ఇప్పటికే మొత్తం కేసుల సంఖ్య 1.09కోట్లకుపైగా చేరగా.. యాక్టివ్ కేసుల సంఖ్య రెండులక్షలపైగా చేరుకుంది. తాజాగా గడిచిన 24 గంటల్లో దేశంలో 24,882 పాజిటివ్ కేసులు రికార్డయ్యాయని కేంద్ర కుటుంబ, ఆరోగ్యమంత్రిత్వశాఖ శనివారం తెలిపింది. దీంతో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 1,13,33,728కు చేరింది. తాజాగా 19,957 కోలుకోగా.. ఇప్పటి వరకు 1,09,73,260 మంది డిశ్చార్జి అయ్యారు. మరో 140 మంది మహమ్మారికి బలవగా.. మొత్తం మృతుల సంఖ్య 1,58,446కు పెరిగింది. ప్రస్తుతం దేశంలో యాక్టివ్ కేసులు 2,02,022 ఉన్నాయని మంత్రిత్వశాఖ వివరించింది. ప్రస్తుతం యాక్టివ్ కేసులు 1.78శాతం ఉన్నాయని, రికవరీ రేటు 9.82శాతం, మరణాల రేటు 1.40శాతం ఉందని వివరించింది.కొత్త కేసులు 85.6 శాతంగా ఉందని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ తెలిపింది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో లాక్‌డౌన్ విధించిన సంగతి తెలిసిందే. గత నెల నుండి ఇక్కడ కరోనా కేసులు భారీగా నమోదవుతున్నాయని తెలిపింది. టీకా డ్రైవ్‌లో భాగంగా ఇప్పటి వరకు 2,82,18,457 డోసులు వేసినట్లు చెప్పింది. దాదాపు 80 రోజుల తర్వాత మళ్లీ రోజువారీ కేసుల సంఖ్య 25వేలకు చేరువైంది. 24 గంటల వ్యవధిలో దేశవ్యాప్తంగా 8.40లక్షల మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా.. 24,882 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. ఈ ఏడాదిలో నమోదైన అత్యధిక రోజువారీ కేసులివే. చివరిసారిగా గతేడాది డిసెంబరు 20న 26,624 కొత్త కేసులు నమోదయ్యాయి. దేశవ్యాప్తంగా కరోనా వ్యాప్తి కట్టడిలోనే ఉన్నప్పటికీ కొన్ని రాష్ట్రాల్లో మాత్రం వైరస్ విజృంభిస్తుండటంతో కేసుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ముఖ్యంగా మహారాష్ట్రలో వైరస్ విచ్చలవిడిగా వ్యాపిస్తోంది. దీంతో అక్కడ రోజువారీ కేసులు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. దేశవ్యాప్తంగా నమోదవుతున్న మొత్తం కేసుల్లో దాదాపు 64శాతం కేవలం ఆ రాష్ట్రంలోనే బయటపడటం గమనార్హం. శుక్రవారం అక్కడ 15,817మంది కొత్తగా వైరస్ బారిన పడ్డారు. దీంతో రాష్ట్రంలో మొత్తం కేసుల సంఖ్య 22,82,191కి పెరిగింది. మహారాష్ట్రలో ఈ స్థాయిలో కేసులు నమోదవడంతో ఐదు నెలల తర్వాత మళ్లీ ఇప్పుడే. చివరిసారిగా గతేడాది అక్టోబరు 2న 15వేల పైచిలుకు కేసులు నమోదయ్యాయి. ఇక రాష్ట్రంలో నిన్న మరో 56 మంది వైరస్‌తో ప్రాణాలు కోల్పోయారు. వైరస్ వ్యాప్తి దృష్ట్యా అక్కడి ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. కరోనా ఉధృతి ఎక్కువగా ఉన్న మూడు జిల్లాల్లో లాక్‌డౌన్ విధించాలని నిర్ణయించింది. ఇక మరికొన్ని ప్రాంతాల్లో రాత్రిపూట కర్ఫ్యూ విధించింది. ఇదిలావుంటే ఇప్పటివరకు దేశంలో సుమారు 2.80కోట్ల మందికి కొవిడ్ వ్యాక్సిన్ అందించినట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం ఒక్కరోజే సుమారు 18.40 లక్షల మందికి వ్యాక్సిన్‌ను అందించినట్లు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రకటించింది.

# టీఆర్ఎస్ ఎమ్మెల్సీలకు పంచాయితీరాజ్ ఇంజనీర్ల మద్దతు

వరంగల్,మార్చి12(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ ఇంజనీర్స్ అండ్ స్టాఫ్ అసోసియేషన్ ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పల్లా రాజేశ్వర్ రెడ్డి, సురభి వాణీదేవి లకు తమ సంపూర్ణ మద్దతు తెలిపింది. ఈ మేరకు అసోసియేషన్ బాధ్యులు హన్మకొండలో మంత్రి ఎర్రబెల్లిని కలిశారు. తమ లేఖను అందచేశారు. ప్రభుత్వం చేపట్టిన పనులు, ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం చేస్తున్న కార్యక్రమాలు అద్భుతంగా ఉన్నాయని, అందుకే తాము తమ ఉద్యోగుల సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని ఆ అసోసియేషన్ బాధ్యులు మంత్రికి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి వారిని అభినందించారు. తమ మద్దతు తెలిపినందుకు కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో అసోసియేషన్‌కు చెందిన వెంకట్ రెడ్డి, ప్రకాశ్ రావు, శ్రీనివాసులు, శంకరయ్య, ప్రభాకర్, సాంబశివారెడ్డి, జ్ఞానేశ్వర్, దయాకర్ చారి, అజయ్ కుమార్, రామ్ దేవ్ అగర్వాల్, సంతోశ్, సాత్విక్, భార్గవి, శ్రీనివాస్, భాను కుమార్ తదితరులు ఉన్నారు.

# ఒక్కో రంగాన్ని ప్రైవేటీకరిస్తున్న మోడీ

## బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు మద్దతు ప్రకటించిన ఇంద్రకరణ్

నిర్మల్,మార్చి13 (ఆర్ఎన్ఎ): ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా, సమ్మె చేస్తున్న బ్యాంకు ఉద్యోగులకు మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సంఘీభావం ప్రకటించారు. బ్యాంకుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 15, 16 తేదీల్లో జరగనున్న సమ్మెకు మద్దతు తెలపాలని బ్యాంకు ఉద్యోగులు శనివారం మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిని కోరగా మంత్రి ఐకే రెడ్డి వారికి తన సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికవ్యవస్థను పీడిస్తోన్న అన్ని సమస్యలకూ ప్రైవేటీకరణ పరిష్కారమని కేంద్ర ప్రభుత్వం భావించడం సరైంది కాదన్నారు. మోదీ ప్రభుత్వం నెమ్మదిగా ఒక్కో రంగాన్ని ప్రైవేటు పరం చేస్తూ వస్తోందని, బ్యాంకింగ్ రంగాన్ని కూడా ప్రైవేటు పరం చేస్తున్నారని ఈ నిర్ణయాన్ని తమ ప్రభుత్వం వ్యతిరేకిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా రైతులు రోజుల తరబడి పోరాటం చేస్తున్నారని, ఇప్పుడు అదే లక్ష్యంతో సమ్మెకు బ్యాంకింగ్ రంగం ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ బ్యాంకు ఉద్యోగులు సమ్మెకు పిలుపునిచ్చారని పేర్కొన్నారు. వైజాగ్ స్టీల్ఎ÷-లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనకు కూడా టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ తమ మద్దతు ప్రకటించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఉద్యోగుల సంఘం నాయకులు, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ గౌడ్, గంధ్రత్ ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటిన ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్, మార్చి 13: తన జన్మదినాన్ని పురస్కరించుకుని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా మొక్కలు నాటారు. రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ పిలుపు మేరకు కవిత ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ సతీమణి శోభ, ఎంపీ సంతోష్‌కుమార్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. ఈ పుట్టినరోజు రోజును ఎప్పటికీ మర్చిపోలేనిదన్నారు. అమ్మ , అన్నయ్య సంతోష్‌తో కలిసి మొక్కలు నాటడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. పుట్టినరోజున మొక్కలు నాటడం ఎప్పటికీ మరిచిపోలేని మధుర జ్ఞాపకం అన్నారు.

# ఢిల్లీలో చలిగాలులు.. చిరు జల్లులు

న్యూఢిల్లీ,మార్చి12(ఆర్ఎన్ఎ): దేశ రాజధాని ఢిల్లీలో వాతావరణం అకస్మాత్తుగా మారింది. తెల్లారినా చీకటిగానే ఉంది. శుక్రవారం బలమైన ఈదురగాలులు, ఉరుములతో కూడిన వర్షం కురిసింది. పశ్చిమ నుంచి వీస్తున్న గాలుల ఫలితంగానే ఢిల్లీలో వాన పడినట్లు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) శాస్త్రవేత్తలు చెప్పారు. శుక్రవారం అంతా పరిస్థితి ఇలాగే ఉండే అవకాశం ఉందని ఐఎండీ ప్రాంతీయ కేంద్రం చీఫ్ కుల్దీప్ శ్రీవాస్తవ చెప్పారు. బలమైన గాలులు వీస్తాయన్నారు. ఉష్ణోగ్రతలు 3 నుంచి 4 డిగ్రీల దాకా పడిపోతాయన్నారు. కాగా, బుధవారం సాయంత్రం కూడా అక్కడ తేలికపాటి జల్లులు కురిశాయి. గురువారం ఢిల్లీలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 35.2 డిగ్రీలు రికార్డ్ అయిందని, అది సాధారణం కన్నా ఆరు డిగ్రీలు ఎక్కువని ఐఎండీ తెలిపింది. కనిష్ఠ ఉష్ణోగ్రత 17.2 డిగ్రీలని, మామూలు కన్నా 3 డిగ్రీలు అధికమని పేర్కొంది. రాబోయే మూడు నాలుగు రోజుల పాటు ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల దాకా నమోదయ్యే అవకాశం ఉందని చెప్పింది. ఇక, వడగళ్ల వాన కురిసే అవకాశమూ ఉందని పేర్కొంది

# ముందు నిజాం షుగర్స్ సంగతి తేల్చు

## -కెటిఆర్‌కు మంత్రి కిషన్ రెడ్డి సవాల్

హైదరాబాద్,మార్చి12(ఆర్ఎన్ఎ): నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిచిన తర్వాతనే కేసీఆర్ కుటుంబం విశాఖ ఉక్కు పరిశ్రమ గురించి మాట్లాడాలని మంత్రి కేటీఆర్‌పై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరుస్తామని టీఆర్ఎస్ 2014 ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిందన్నారు. ఏడేళ్ళుగా షుగర్ పరిశ్రమను ఎందుకు తెరవలేదో చెప్పాలన్నారు. టీఆర్ఎస్ పార్టీతో పాటు.. మంత్రి కేటీఆర్‌పై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. ఖైరతాబాద్‌లో కళాకారుల భేటీలో మాట్లాడుతూ.. ఎన్నికలు వచ్చినప్పుడు కేటీఆర్‌కు పూనకం వస్తోందని కిషన్‌రెడ్డి విమర్శించారు. ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను తగ్గించుకోవటానికి కేంద్రాన్ని విమర్శిస్తున్నారన్నారు. 70శాతం ఫిట్‌మెంట్ ఇస్తామన్నప్పటికీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు టీఆర్ఎస్‌కు ఓటు వేయరన్నారు. టీఆర్ఎస్, ఎంఐఎంలే బైంసా ఘటనకు కారణమన్నారు. బైంసా ఘటనకు టీఆర్ఎస్ ప్రభుత్వానిదే బాధ్యత అన్నారు. త్వరలో బైంసాలో పర్యటిస్తానని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు.

# ఘనంగా ఎమ్మెల్సీ కవిత జన్మదినోత్సవం

## కేక్ కటి చేసి శుభాకాంక్షలు తెలిపిన మహ్మూద్ అలీ

## రవీంద్రభారతిలో అభిమానుల భారీ చిత్ర కానుక



హైదరాబాద్,మార్చి13(ఆర్ఎన్ఎ): తెలంగాణ జాగృతి నేతృత్వంలో ఎమ్మెల్సీ కవిత పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన హోంమంత్రి మహమూద్ అలీ.. కేక్ కట్ చేసి కవితకు శుభాకాంక్షలు తెలియజేశారు. కవిత పుట్టినరోజు సందర్భంగా దివ్యాంగులకు బైకులు, విద్యార్థినిలకు సైకిళ్లను హోంమంత్రి మహమూద్ అలీ అందించారు. అనంతరం తెలంగాణ జాగృతి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని హోంమంత్రి ప్రారంభించారు. తెలంగాణ ఉద్యమంలో జాగృతి సేనతో కలిసి ఎమ్మెల్సీ కవిత ప్రజల్లో అవగాహన తీసుకొచ్చిందని ఆయన అన్నారు. తెలంగాణకే సొంతమైన బతుకమ్మను ప్రపంచస్థాయికి తీసుకెళ్లిన ఘనత కవితకే దక్కుతుందని ఆయన పొగిడారు. తెలంగాణ ఉద్యమంలో భాగమై.. ఎంతోమంది మహిళలను ఉద్యమంలో ఆమె నడిపించారని హోంమంత్రి అన్నారు. గతంలో ఎంపీగా ఉన్నప్పుడు.. ఇప్పుడు ఎమ్మెల్సీగా ఎన్నికైన తర్వాత ఆమె ప్రజలకు ఎంతో సేవ చేసిందని ఆయన అన్నారు. భగవంతుని ఆశీస్సులతో కవిత మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, సాట్స్ ఛైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, టీఆర్ఎస్ నాయకులు దేవీ ప్రసాద్, మర్రి రాజశేఖర్ రెడ్డి, తలసాని సాయి కిరణ్ యాదవ్, తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజీవ్ సాగర్, ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, హైదరాబాద్ శాఖ అధ్యక్షుడు అనంతుల ప్రశాంత్ పాల్గొన్నారు. ఇకపోతే రవీంద్రభారతిలో కల్వకుంట్ల కవిత 60 అడుగుల చిత్రాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ కవితకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ నేలపై 60 అడుగుల భారీ చిత్రాన్ని ఏర్పాటు చేశారు. నిజామాబాద్‌కు చెందిన టీఆర్ఎస్ యువనేత కవిత మీద అభిమానంతో ఈ చిత్రాన్ని ఏర్పాటు చేశారు. మహారాష్ట్రకు చెందిన ప్రఖ్యాత చిత్రకారుడు శైలేష్ కులకర్ణి కవిత చిత్రాన్ని వేశారు. ఈ చిత్రం వేసేందుకు 20 గంటలకు పైగా కళాకారులు శ్రమించారు.

# ఉత్తరాఖండ్ బిజెపి చీఫ్‌గా మదన్ కౌశిక్

## -పార్టీ కేంద్ర కమిటీ కీలక నిర్ణయం

న్యూఢిల్లీ,మార్చి12(ఆర్ఎన్ఎ): ఉత్తరాఖండ్ బీజేపీ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే మదన్ కౌశిక్ నియమిస్తూ ఆ పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత అధ్యక్షుడు బన్షిధర్ భగత్ స్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. అధ్యక్ష పదవి నుంచి దిగిపోయిన బన్షిధర్ భగత్‌కు సీఎం తిరథ్ సింగ్ రావత్ ప్రభుత్వంలో కీలక మంత్రి పదవి ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. కాగా పార్టీ కొత్త చీఫ్ మదన్ కౌశిక్ హరిద్వార్ నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఉత్తరాఖండ్ బీజేపీ ఎమ్మెల్యేల్లో అత్యంత సీనియర్‌గా ఆయనకు గుర్తింపు ఉంది. రాష్ట్రానికి కొత్త ముఖ్యమంత్రిగా మళ్లీ రాజ్‌పుత్ వర్గానికే ప్రాధాన్యత ఇచ్చిన బీజేపీ అధిష్టానం.. అక్కడి పార్టీ చీఫ్ పదవిని కూడా మరోసారి బ్రాహ్మణ వర్గానికే కట్టబెట్టింది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఉత్తరాఖండ్‌లో రాజ్‌పుత్‌లు, బ్రాహ్మణ సామాజిక వర్గాలకు బలమైన వర్గాలుగా పేరుంది. కాగా ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పదవి నుంచి త్రివేంద్ర సింగ్ రావత్‌ను తప్పించిన బీజేపీ అధిష్టానం... ఆ బాధ్యతలను తిరథ్ సింగ్ రావత్‌కు అప్పగించిన విషయం తెలిసిందే.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

ముంబై,మార్చి12(ఆర్ఎన్ఎ): కొండెక్కిన పసిడి, వెండి ధరలు క్రమంగా దిగివస్తున్నాయి. రికార్డు ధరల నుంచి ఇటీవల వరుస పతనాలతో సామాన్యుడిని ఊరిస్తున్న బంగారం శుక్రవారం కూడా తగ్గుముఖం పట్టింది. ఎంసీఎక్స్‌లో పదిగ్రాముల బంగారం రూ 188 తగ్గి రూ 44,690 పలికింది. ఇక కిలో వెండి రూ 415 దిగివచ్చి రూ 67,130కి దిగివచ్చింది. అంతర్జాతీయ మార్కెట్‌లో సోమవారం బంగారం ధరలు తొమ్మిది నెలల కనిష్ట స్థాయికి చేరినా ఆపై పుల్‌బ్యాక్ ర్యాలీ తలెత్తడంతో పుంజుకున్నాయి. బంగారం ధరల్లో మరికొన్ని రోజులు ఒడిదుడుకులు కొనసాగుతాయని బులియన్ నిపుణులు అంచనా వేస్తున్నారు. వచ్చేవారం అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ తదుపరి భేటీ అనంతరం బంగారం ధరలు ఏ దిశగా వెళతాయనేది వెల్లడయ్యే క్రమంలో ఈ భేటీ కోసం బంగారం మదుపుదారులు వేచిచూస్తున్నారు.

# మల్లన్న సాగర్ నిర్వాసితులకు ఇంత అన్యాయమా

## వారి సమస్యలు అసెంబ్లీలో ప్రస్తావిస్తా: రఘునందన్

హైదరాబాద్,మార్చి13 (ఆర్ఎన్ఎ): మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యను అసెంబ్లీలో ప్రస్తావిస్తానని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు తెలిపారు.

భూములును ఇచ్చిన గ్రామస్థులను ఇంత దారుణంగా పట్టించుకోక పోవడం ఎక్కడా చూడలేన్నారు. వారికి భూమికి భూమి ఇవ్వాలన్నారు. లేకుంటే తగిన పరిహారం చెల్లించాలన్నారు. నిర్వాసితులను నిర్లక్ష్యం చేస్తున్న సీఎం కేసీఆర్, మంత్రులపై విమర్శల వర్షం కురిపించారు. కేసీఆర్ గజ్వేల్‌కు మాత్రమే సీఎం కాదన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్లలో జరుగుతోన్న అభివృద్ధి రాష్ట్రమంతా జరగాలన్నారు. హైదరాబాద్ ఆదాయాన్ని కేసీఆర్, కేటీఆర్, హరీశ్ తరలించుకుపోతున్నారని ఆయన ఆరోపించారు. అసలు కేటీఆర్ కేంద్రాన్ని విమర్శించే ముందు ఏడేళ్లలో ఏం చేశారో చెప్పాలని రఘు ప్రశ్నించారు. హైదరాబాద్‌లో భూములు అమ్మి ప్రభుత్వాన్ని నడిపేవారు కూడా.. బీజేపీని విమర్శించడం హాస్యాస్పదమని రఘునందన్ వ్యాఖ్యానించారు.

# గ్రామ వాలంటీర్ దారుణ హత్య

అనంతపురం,మార్చి13(ఆర్ఎన్ఎ): కూడేరు మండలం శివరాంపేటలో దారుణం చోటు చేసుకుంది. గ్రామ వాలంటీర్‌ను అర్ధరాత్రి దుండగులు కత్తులతో పొడిచి చంపారు. పొలంలో నిద్రిస్తున్న వాలంటీర్ శ్రీకాంత్ (24)ని గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# టీఆర్ఎస్ ఖతర్ శాఖ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి కొప్పుల




హైదరాబాద్, మార్చి13: టీఆర్ఎస్ ఖతర్ శాఖ రూపొందించిన 2021 వార్షిక క్యాలెండర్‌ను హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ శనివారం ఆవిష్కరించారు. టీఆర్ఎస్ ఖతర్ శాఖ ఉపాధ్యక్షుడు నర్సయ్య, నాయకులు నరేష్, మారుతిలతో మంత్రి గల్ఫ్ దేశాలలో పనిచేస్తున్న తెలంగాణ బిడ్డల జీవన పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గల్ఫ్ దేశాలలో జీతభత్యాలు తగ్గించడం చాలా బాధ కలిగించే విషయమన్నారు. సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరైట్స్, కువైట్, ఒమన్,ఖతర్, ఇరాన్ తదితర దేశాలలో కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాలకు చెందిన వేలాది మంది పనిచేస్తున్న విషయం తెలిసిందే. వీరిలో చాలామంది చిరుద్యోగులే. వీళ్ల జీతాలలో సగానికి పైగా తగ్గించాలంటూ ప్రధానమంత్రి మోడీ ఏకపక్షంగా నిర్ణయించి ఉత్తర్వులివ్వడం పట్ల మంత్రి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తెచ్చి ప్రధానికి వివరించాల్సిందిగా కోరుతానని మంత్రి హామీనిచ్చారు.

# దుబ్బాక, జీహెచ్ఎంసీలో వచ్చిన ఫలితాలే వస్తాయి

## -ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ విజయం సాధిస్తామన్న రఘునందన్


హైదరాబాద్,మార్చి13 (ఆర్ ఎన్ఎ): దుబ్బాక, జీహెచ్ఎంసీలో వచ్చిన ఫలితాలే ఎమ్మెల్సీ ఎన్నికల్లో సైతం పునరావృతమవుతాయని బీజేపీ దుబ్బాక ఎమ్మెల్యే రఘునందనరావు ధీమా వ్యక్తం చేశారు. జర్నలిస్టులపై ప్రేమ వలకబోసిన ట్విట్టర్ పిట్ట.. వారిని కత్తితో పొడిస్తే ఎందుకు స్పందించలేదని రఘునందనరావు ప్రశ్నించారు. కేటీఆర్, హరీష్‌రావుపై రఘునందనరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం రఘునందనరావు మీడియాతో మాట్లాడుతూ... ఆంధ్రా ప్రాంత కార్పొరేట్ కంపెనీలు, పట్టభద్రుల ఓట్ల కోసమే వైజాగ్ స్టీల్ ప్లాంట్‌పై మంత్రి కేటీఆర్ ప్రేమ చూపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేటీకరణ గురించి కేటీఆర్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు కేంద్రంపై విమర్శలు చేయటం కేటీఆర్‌కు అలవాటుగా మారిందని ధ్వజమెత్తారు. హరీష్‌రావు సిద్దిపేటకు మాత్రమే ఆర్థికమంత్రా? లేక తెలంగాణ రాష్ట్రానికా? అని రఘునందనరావు ప్రశ్నించారు. ఉద్యోగులతో పీఆర్సీపై చర్చించి సీఎం కేసీఆర్ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారన్నారు. తెలంగాణకు కేంద్రం అన్యాయం చేస్తే.. పార్లమెంట్‌లో టీఆర్ఎస్ ఎంపీలు ఎందుకు మాట్లాడరు? అని రఘునందనరావు ప్రశ్నించారు. అసెంబ్లీలో బీజేపీకి సమయం ఇవ్వకపోతే స్పీకర్‌ను కూడా నిలదీస్తామని హెచ్చరించారు. గాంధేయ మార్గంలోనే తమ హక్కును సాధిస్తామని స్పష్టం చేశారు. కేంద్రం చేసిన సాయంపై సభలో చర్చకు సిద్ధమని టీఆర్ఎస్ నేతలకు రఘునందనరావు సవాల్ విసిరారు. మందబలంతో సభను నడిపితే కుదరదన్నారు. నిరుద్యోగభృతిపై సభలో ప్రభుత్వ వైఖరిని ఎండగడతావని స్పష్టం చేశారు. బైంసాలో గత ఘటనలకు కారణమైన వారిని కఠినంగా శిక్షించి ఉంటే శాంతిభద్రతలు బాగుండేవని రఘునందనరావు తెలిపారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ స్ఫుటముగ రూపముతో-ను
స్ఫుటముగ సంభాషణలను జనులకు పలుకన్
పటుతరము ప్రతిభామయు
నటిగ "ఫరీదా జలాల్" నటులందు కొనున్!!

(మార్చి 14 నటి ఫరీదాజలాల్ పుట్టిన రోజు)



-రాధశ్రీ

సెల్: 9494481210

# మళ్లీ కోరలు చాస్తోన్న కరోనా

నేటినిజం
ఆదివారం 14-3-2021

భారత్‌లో కరోనా మరోసారి కోరలు చాస్తోంది. దేశంలో కరోనా వైరస్ మహమ్మారి మళ్లీ ఉధృతి కొనసాగడం ఆందోళన కలిగిస్తోంది. ఓ వైపు వ్యాక్సిన్ వేస్తున్నా మళ్లీ కరోనా కేసులు మాత్రం తగ్గడం లేదు. నిజానికి అజాగ్రత్తలు కూడా కారణమని అంటున్నారు. కరోనా సెకండ్ వేవ్ లేదని కూడా వైద్యారోగ్యశాఖ చెబుతోంది. ఇకపోతే మహారాష్ట్రలో పలు పట్టణాల్లో లాక్‌డౌన్ విధించారు. పంజాబ్ లుధియానాలోనూ లాక్‌డౌన్ విధించారు. ఇప్పటికే గడిచిన వారం రోజుల్లోనే దేశవ్యాప్తంగా లక్ష మందికి పైగా కరోనా బారిన పడ్డారు. ఇప్పటికే మొత్తం కేసుల సంఖ్య 1.09కోట్లకుపైగా చేరగా.. యాక్టివ్ కేసుల సంఖ్య రెండులక్షలపైగా చేరుకుంది. తాజాగా గడిచిన 24 గంటల్లో దేశంలో 24,882 పాజిటివ్ కేసులు రికార్డయ్యాయని కేంద్ర కుటుంబ, ఆరోగ్యమంత్రిత్వశాఖ చేసిన ప్రకటన మహమ్మారి విజృంభణను తెలియచేస్తోంది. తేదీతో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 1,13,33,728కు చేరింది. తాజాగా 19,957 కోలుకోగా.. ఇప్పటి వరకు 1,09,73,260 మంది డిశ్చార్జి అయ్యారు. మరో 140మంది మహమ్మారికి బలవగా.. మొత్తం మృతుల సంఖ్య 1,58,446కు పెరిగింది. ప్రస్తుతం దేశంలో యాక్టివ్ కేసులు 2,02,022 ఉన్నాయని మంత్రిత్వశాఖ వివరించింది. ప్రస్తుతం యాక్టివ్ కేసులు 1.78శాతం ఉన్నాయని, రికవరీ రేటు 9.82శాతం, మరణాల రేటు 1.40శాతం ఉందని వివరించింది. టీకా డ్రైవ్‌లో భాగం గా ఇప్పటి వరకు 2,82,18,457 డోసులు వేసినట్లు చెప్పింది. దీన్నిబట్టి చూస్తుంటే దేశంలో కరోనా మహమ్మారి మళ్లీ తిరగబెడుతున్నట్లే కన్పిస్తోంది. రోజురోజుకీ కొత్త కేసులు పెరుగుతుండటం కలవరపెడుతోంది. ఈ ఏడాదిలో నమోదైన అత్యధిక రోజువారీ కేసులివే. చివరిసారిగా గతేడాది డిసెంబరు 20న 26,624 కొత్త కేసులు నమోదయ్యాయి. దేశవ్యాప్తంగా కరోనా వ్యాప్తి కట్టడిలోనే ఉన్నప్పటికీ కొన్ని రాష్ట్రాల్లో మాత్రం వైరస్ విజృంభిస్తుండటంతో కేసుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ముఖ్యంగా మహారాష్ట్రలో వైరస్ విచ్చలవిడిగా వ్యాపిస్తోంది. దీంతో అక్కడ రోజువారీ కేసులు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. దేశవ్యాప్తంగా నమోదవుతున్న మొత్తం కేసుల్లో దాదాపు 64శాతం కేవలం ఆ రాష్ట్రంలోనే బయటపడటం గమనార్హం. శుక్రవారం అక్కడ 15,817మంది కొత్తగా వైరస్ బారిన పడ్డారు. దీంతో రాష్ట్రంలో మొత్తం కేసుల సంఖ్య 22,82,191కి పెరిగింది. మహారాష్ట్రలో ఈ స్థాయిలో కేసులు నమోదవడంతో ఐదు నెలల తర్వాత మళ్లీ ఇప్పుడే. చివరిసారిగా గతేడాది అక్టోబరు 2న 15వేల పైచిలుకు కేసులు నమోదయ్యాయి. ఇక రాష్ట్రంలో నిన్న మరో 56 మంది వైరస్‌తో ప్రాణాలు కోల్పోయారు. వైరస్ వ్యాప్తి దృష్ట్యా అక్కడి ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. కరోనా ఉధృతి ఎక్కువగా ఉన్న మూడు జిల్లాల్లో లాక్‌డౌన్ విధించాలని నిర్ణయించింది. ఇక మరికొన్ని ప్రాంతాల్లో రాత్రిపూట కర్ఫ్యూ విధించింది.

మరోవైపు వ్యాక్సినేసన్ ప్రక్రియ కూడా వేగంగా జరుగుతోంది. ఇప్పటివరకు దేశంలో సుమారు 2.80కోట్ల మందికి కొవిడ్ వ్యాక్సిన్ అందించినట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం ఒక్కరోజే సుమారు 18.40 లక్షల మందికి వ్యాక్సిన్‌ను అందించినట్లు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రకటించింది. ప్రస్తుతం దేశంలో ఇన్‌ఫెక్షన్ 1.74 శాతంగా ఉంది. మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, పంజాబ్, కర్ణాటక, గుజరాత్‌లలో కరోనా కేసులు పెరుగుతున్నాయని.. కొత్త కేసులు 85.6 శాతంగా ఉందని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ తెలిపింది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో లాక్‌డౌన్ విధించిన సంగతి తెలిసిందే. గత నెల నుండి ఇక్కడ కరోనా కేసులు భారీగా నమోదవుతున్నాయని తెలిపింది. మొత్తంగా చూస్తుంటే కరోనా చాపకింద నీరులా విస్తరిస్తోంది. దీనితో పెద్దగా ప్రమాదం లేదని..ఎవ్వరూ భయాందోళన చెందాల్సిన అవసరం లేదని చెబుతున్న వేళ తాజా కేసుల పెరుగుదల దేశ ప్రజలకు కనువిప్పు కావాలి. ముఖ్యంగా భారత్‌కు ముప్పు లేదని భావించిన వేళ మనలనుకూడా ఈ కరోనా వైరస్ సవాల్ చేస్తోంది. దేశంలో కరోనా బాధితులు రోజురోజుకు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. తన పరిధి పెంచుకుంటున్న కొవిడ్ 19, మహమ్మారిగా పరిణ మించడం ఇప్పుడు భయాందోళనలు కలిగిస్తోంది. ఇటీవలి కాలంలో చూస్తే 2009లో ఒక్కసారిగా విజృంభించిన స్వైన్ ఫ్లూను మహమ్మారిగా చెప్పవచ్చు. అప్పుడు ఈ వ్యాధి బారిన పడి ప్రపంచవ్యాప్తంగా వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. అంతవరకు గుర్తించని కొత్త వైరస్‌లు, ఒకరి నుంచి మరొకరికి సులభంగా సోకేవి మహమ్మారులుగా మారతాయి. కరోనా వైరస్ ఈ కోవలోకే వస్తోంది. దీన్ని నివారించడానికి ఇంకా వ్యాక్సిన్లు కానీ, నయం చేయడానికి సమర్థమైన చికిత్సలు కానీ ఇంకా అందుబాటులోకి రానందున దీని వ్యాప్తిని అరికట్టలేక పోతున్నారు. వైరస్ కట్టడిని సీరియస్‌గా తీసుకోవ్వై దని, సరైన చర్యలు చేపట్టలేదని, ఫలితంగా కేసులు ఎక్కువై పోతున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. ఇలాగే ఉపేక్షిస్తూ పోతే రాబోయే రోజుల్లో కేసులు పెరిగే ప్రమాదం ఉందని ఆరోగ్య సంస్థ చేసిన హెచ్చరిక వ్యాధి తీవ్రతకు అద్దం పడుతోంది. వైరస్‌ను కట్టడి చేసేందుకు ఎవరికి వారు ముందుకు రావాలని కోరింది. మున్ముందు కేసులు మరింత పెరిగే ప్రమాదముందని ప్రస్తుత పరిస్థితులను బట్టి తెలుస్తోంది. దాంతో పాటే మరణాలు ఎక్కువయ్యే అవకాశం ముందన్న హెచ్చరికలను జాగ్రత్తగా గమనించాలి. తాజా కేసుల కారణంగా ఇకపై అజాగ్రత్తగా ఉండడానికి వీల్లేదంటున్నారు. ఏమీ కాదులే అని చేతులు దులిపేసుకుంటే మరిన్ని కేసులు,మరణాలు పెరిగే ప్రమాదం ఉంటుందన్నారు. ఇకపోతే ఈ వైరస్‌ను సమర్థంగా అరికట్టవచ్చని, నియంత్రించ వచ్చని గత ఏడాదిగా మనం తీసుకున్న చర్యలు నిరూపించాయి. వ్యాక్సిన్ రావడంతో భరోసా కూడా పెరిగింది. వ్యాక్సిన్ వేసుకోవడానికి ప్రజలు కూడా ఎందుకనో అలసత్వం చూపుతున్నారు. ప్రజలు కూడా తమకుతాముగా పరిశుభ్రతను పాటించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా చేస్తున్న కృషి నిరంతరాయంగా సాగాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. మనకేం కాదులే అన్న ఏమరుపాటు ఉండరాదు. స్వచ్ఛత, పరిశుభ్ర పరిసరాలు లక్ష్యంగా ప్రజలు ముందుకు రావాలి. వ్యాధి నిరోధక పద్ధతులను పాటించాలి. అప్పుడే ఈ మహమ్మారి నుంచి రక్షించుకోగలమని సూచిస్తున్నారు.

## తృణమూల్‌లో చేరిన యశ్వంత్ సిన్హా

### మమతపై దాడితో నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడి

### భాజాపా తీరుపై మండిపాటు




కోల్‌కతా,మార్చి13 (ఆర్‌ఎన్‌ఎ): పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు సమిపిస్తున్న వేళ అక్కడ రాజకీయాలు వేగంగా మారుతున్నాయి. కేంద్ర మాజీ మంత్రి, భాజపా మాజీ నేత యశ్వంత్ సిన్హా తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. టీఎంసి నుంచి నేతలు బిజెపిలోకి వలస కడుతుంటే యశ్వంత్ మాత్రం తృణమూల్లోట చేరడం విశేషం. ఉదయం కోల్‌కతాలోని టీఎంసీ భవన్‌లో ఆ పార్టీ నేతల సమక్షంలో తృణమూల్ కండువా కప్పుకున్నారు. మమతపై జరిగిన దాడి కారణంగానే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని వింత పరిస్థితిని దేశం ఇప్పుడు ఎదుర్కొం టోంది. వ్యవస్థల బలంపైనే ప్రజాస్వామ్య శక్తిసామర్థ్యాలు ఆధారపడి ఉంటాయి. కానీ నేడు దేశంలో న్యాయవ్యవస్థతో సహా అన్ని వ్యవస్థలు బలహీనపడుతున్నాయి. వాజ్‌పేయీ హయంలోని భాజపా ప్రభుత్వం ఏకాభిప్రాయ విధానాలను విశ్వసించేది. కానీ నేటి ప్రభుత్వం 'అణచివేత–విజేత' ధోరణిని నమ్ముతోంది. అందుకే అకాలీదళ్, బిజు జనతాదళ్ వంటి పార్టీలు ఎన్డీయేను వీడాయని అంటూ భాజపాపై విమర్శలు గుప్పించారు. 83ఏళ్ల యశ్వంత్ సిన్హా గతంలో సుదీర్ఘకాలం జనతాదళ్, భాజపాలో పనిచేశారు. భాజపా హయాంలో కేంద్ర ఆర్థిక మంత్రి, విదేశాంగ మంత్రిగానూ వ్యవహరించారు. అయితే సొంతపార్టీపైనే బహిరంగ విమర్శలు చేసి వార్తల్లో నిలిచిన సిన్హా.. 2018లో భాజపాను వీడారు. ఆ తర్వాత కూడా ఎన్డీయే ప్రభుత్వాన్ని విమర్శిస్తూ వస్తున్న ఆయన.. బెంగాల్ ఎన్నికల సమయంలో తృణమూల్ పార్టీలో చేరడం ప్రాధాన్యత సంతరించుకుంది. గత కొద్ది నెలలుగా బెంగాల్‌లో అనేక మంది తృణమూల్ నేతలు కాషాయ కండువా కప్పుకుంటున్న తరుణంలో టీఎంసీలోకి సిన్హా రాక ఆ పార్టీకి కలిసొచ్చే పరిణామమే అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## తెలంగాణ అద్భుత ప్రగతి సాధించింది

### -అప్పుల పాలయితదన్న వారికి చెంపపెట్టు: ఎర్రబెల్లి

వరంగల్,మార్చి13(ఆర్‌ఎన్‌ఎ): తెలంగాణ వస్తే అప్పుల పాలు అయితదన్న తెలంగాణ నేడు అబివృద్ధి దిశగా దూసుకుపోతుందని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. హన్మకొండలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ వరంగల్ జిల్లా ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..బంగారు తెలంగాణ చేస్తున్న సీఎం కేసీఆర్‌పై ప్రతిపక్షాలు చేస్తున్న చిల్లర రాజకీయాలను మీరంతా గమనించాలన్నారు. విభజన చట్టంలో ఉన్న కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం, విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నది.బంగారు తెలంగాణ నిర్మాణంలో ఉద్యోగులందరి కృషి మరువలేనిదన్నారు. ఉద్యోగుల సమస్యలు సీఎం కేసీఆర్ దగ్గరకు తీసుకుపోయి త్వరలోనే పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వానికి ఉద్యోగులు అండగా నిలవాలి. ఉద్యోగులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ సమ్మేళనానికి రాష్ట్ర, జిల్లా గెజిటెడ్ ఆఫీసర్ల సంఘం నేతలు పరిటా సుబ్బారావు, కారం రవిందర్ రెడ్డి, జగన్ మోహన్ రావు, ఫణి కుమార్, రాజేశ్ తదితరులతోపాటు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.




# వినియోగదారుల హక్కుల పట్ల అవగాహన కల్పించాలి..!

**(15 మార్చి 'ప్రపంచ వినియోగదారుల హక్కుల దినం' సందర్భంగా)**

వినియోగదారుల ఉద్యమం ఓ సామాజిక అవసరంగా ఉద్భవించింది. అనైతిక మరియు అన్యాయమైన వస్తు సేవల వ్యాపార పద్ధతులతో ప్రతి వినియోగదారుడు అనాదిగా నష్టపోవడం జరుగుతోంది. కృత్రిమ వస్తు కొరత, చీకటి వ్యాపారాలు, ఆహార మరియు నూనెల కల్తీ లాంటి వస్తు సేవలతో వినియోగదారులు ఏళ్లుగా అన్యాయాలకు గురి అవుతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో 1960ల్లో ప్రారంభమైన వినియోగదారుల ఉద్యమాన్ని గుర్తించిన భారత ప్రభుత్వం 'వినియోగదారుల రక్షణ చట్టం–1986' తీసుకురావడం జరిగింది. ఇలాంటి వినియోగదారుల సమస్యలను చర్చించడానికి ప్రతి ఏటా 15 మార్చి రోజున 'ప్రపంచ వినియోగదారుల హక్కుల దినం' పాటించడం జరుగుతోంది. భారతదేశంలో 24 డిసెంబర్ రోజున 'జాతీయ వినియోగదారుల దినం' జరుపుకోవడం కూడా ఆనవాయితీగా వస్తున్నది. వినియోగదారులు లేకుండా వ్యాపారాలు లేవు. వినియోగదారులు సంతృప్తి చెందితేనే వ్యాపారాలు వర్ధిల్లుతాయి. ప్రపంచవ్యాప్తంగా వినియోగదారుల హక్కుల పరిరక్షణ, హక్కులను గౌరవించడం, హక్కులకు విఘాతం కలిగించే అనైతిక అవినీతిపరులను కట్టడి చేయడం లాంటి అంశాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తారు. 15 మార్చి 1962 రోజున అప్పటి అమెరికా అధ్యక్షులు జాన్ యఫ్ కెనెడీ ప్రతిపాదన ఫలితంగా వినియోగదారుల హక్కుల సమస్యలను తొలిసారి చర్చించడం జరిగి, 15 మార్చి 1983 నుండి ప్రపంచ వినియోగదారుల హక్కుల దినం పాటించుట జరుగుతోంది. వినియోగదారుల హక్కుల్లో భద్రత హక్కు, సమాచారాన్ని పొందే హక్కు, ఎంచుకునే హక్కు, వినిపించగల హక్కు, ప్రాథమిక అవసరాలను సంతృప్తి పరిచే హక్కు, పరిష్కార హక్కు, వినియోగదారుల విద్య హక్కు మరియు ఆరోగ్యకర పర్యావరణ హక్కులు వస్తాయి.

ప్లాస్టిక్ కాలుష్యాన్ని కట్టడి చేయుటలో ప్రధాన బాధ్యత వినియోగదారుల మీద ఉందని గమనించిన అంతర్జాతీయ వినియోగదారుల సమాజం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినం–2021 నినాదంగా 'ప్లాస్టిక్ కాలుష్య సమస్యకు పరిష్కారం (టాక్లింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్)' అనే అంశాన్ని తీసుకోవడం జరిగింది. జీవవిచ్ఛిన్నం కాని ప్లాస్టిక్ కాలుష్యం ప్రపంచాన్ని కుదిపి వేస్తున్న ఆధునిక సమాజంలో మానవ మనుగడే ప్రశ్నార్థకంగా మారింది. 2050 నాటికి మహా సముద్రాలలో చేపల కన్న ప్లాస్టిక్ ఎక్కువగా ఉంటుందని అంచనా వేశారు. ఒక ఏడాదిలో ప్లాస్టిక్ కాలుష్యం వల్ల లక్ష సముద్ర క్షీరదాలు, తాబేళ్లు మరియు సముద్ర పక్షులు మరణిస్తున్నాయి. ప్రతి ఏటా 8 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ సముద్రాలను చేరుతోంది. ఒకే సారి వాడి పాడేసే ప్లాస్టిక్‌తో ప్రమాదకర కాలుష్యం ఏర్పడుతోంది. ప్లాస్టిక్ కాలుష్యం తగ్గించడానికి రిప్లేస్, రీథింక్, రెఫ్యూజ్, రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ మరియు రిపేర్ అనబడే సూత్రాలను సత్వరమే సమర్థవంతంగా అమలు పరచాలి.

వినియోగదారుడు అన్యాయానికి, వస్తు సేవల లోపానికి గురైనపుడు న్యాయం కోసం వినియోగదారుల కోర్టులు/ఫోరమ్‌లను ఆశ్రయించి తగు పరిహారం పొంది, అక్రమ వ్యాపారులకు/ఉత్పత్తిదారులకు శిక్షలు కూడా పడేలా చేసే వెసులుబాటు చట్టం ద్వారా కల్పించబడింది. వినియోగదారుల ఫోరమ్‌లు జిల్లా వివాద పరిష్కార ఫోరమ్‌లు, రాష్ట్ర వివాద పరిష్కార ఫోరమ్‌లు మరియు జాతీయ వివాద పరిష్కార ఫోరమ్‌లు అందుబాటులో ఉన్నాయి. వస్తు/సేవల విలువ 20 లక్షల లోపు ఉన్నప్పుడు జిల్లా వినియోగదారుల కోర్టులకు, 20 లక్షల నుంచి కోటి విలువ వరకు రాష్ట్ర కోర్టులు మరియు ఒక కోటి కన్న ఎక్కువ ఉన్నపుడు జాతీయ వినియోగదారుల కమిషన్లను ఆశ్రయించాల్సి ఉంటుంది. అక్రమ వ్యాపారులను కట్టడి చేస్తూ, వినియోగదారులకు సత్వర పరిహారాలు అందించే నెలవులుగా వినియోగదారుల ఫోరమ్‌లు సర్వదా కృషి చేస్తున్నారు. అన్యాయానికి గురైన సామాన్య వినియోగదారులు నేటికీ ఫోరమ్‌లను ఆశ్రయించడం లేదు. వినియోగదారుల విద్యను ప్రజలకు చేరువ చేస్తూ, వినియోగదారుల హక్కుల అవగాహన మరియు చైతన్య పరిచే కార్యక్రమాలను బాధ్యతగల పౌరులు ఉద్యమంలా చేపట్టాలి. వ్యాపార వస్తు సేవలకు పుణాది వినియోగదారుడే. వినియోగదారుడు సదా న్యాయమైన సేవలను పొందినపుడే వస్తు వ్యాపారాలు వర్ధిల్లుతూ, దేశం సమగ్రాభివృద్ధికి పథంలో నడుస్తుందని గుర్తించుకోవాలి.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# కరోనా హెచ్చరికలు బేఖాతరు

### మళ్లీ పెరిగిన దాబాలు, రోడ్‌సౌడ్ హోటళ్లు

హైదరాబాద్,మార్చి13(ఆర్‌ఎన్‌ఎ): మొన్నటి వరకు కరోనాతో హోటళ్లు మూతపడ్డాయి. కట్టుబడిగా ఉన్నారు. కానీ మళ్లీ ఇప్పుడు విచ్చలవిడితనం కనిపిస్తోంది. ప్రముఖ హోటళ్లలో రోణ చర్యలు తీసకుంటున్నా కొన్ని ప్రముఖ హోటళ్లలోనే నాణ్యత సంగతెలా ఉన్నా పరిశుభ్రత పాటించడం లేదు. హోటళ్లల పురుగులు ప్రత్యక్షంకావడం చూస్తుంటే హోటళ్లకు వెళ్లి తినాలంటే భయమేస్తోందని ప్రజలు అంటున్నారు. దీనికితోడు రోడ్ సైడ్ హోటళు, దాబాల్లో నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారు. రుచి, శుచితో సంబంధం లేకుండా కేవలం ధనార్జనే ధ్యేయంగా నిర్వాహకులు వాటిని నిర్వహిస్తున్నారు. కరోనా వచ్చి పోయినా వారు రక్షణ చర్యలు తీసుకోవడం లేదు. అలాగే ప్రజలు కూడా మళ్లీ పాతపద్దతులకే అలవాటు పడ్డారు. ఇవన్నీ కూడా కరోనా పెరగడానికి కారణమని చెబుతున్నారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతూ వేల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. కరోనా లాంటి వ్యాధులు ప్రబలుతున్న వేళ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. ఎక్కడ పడితే అక్కడ తిని అనారోగ్యం పాలవ్వరాదని హెచ్చరిస్తున్నారు. నగరాల్లో వందలాదిగా ఇటీవల హోటళ్లు, దాబాలు వెలిశాయి. నిత్యం వేలలాది మంది ఇందులో అల్పాహారం, భోజనం చేస్తుంటారు. వీటిలో ఏ ఒక్క దాంట్లో కూడా నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు. పైపై హంగులకే ప్రాధాన్యతను ఇస్తూ శుభ్రతను మరస్తున్నారు. ముఖ్యంగా మాంసాహార భోజనాల్లో విపరీతమైన కల్తీ జరుగుతోంది. నాశిరకం, చెడిపోయిన పదార్థాలను తీసుకొచ్చి వాటితో వివిధ రకాల మంసాహారాలను తయారు చేస్తున్నారు. రాత్రి సమయాల్లో మిగిలిన పదార్థాలను ఫ్రిజ్‌లో ఉంచి మరుసటి రోజు ఉదయం వండుతున్నారు. ఇవేవి తెలియని ప్రజలు వాటిని తిని ఆరోగ్యాలు గుల్ల చేసుకుంటున్నారు. చికెన్, మటన్ బిర్యానీలు చల్లారిన తర్వాత వాటిని వేడి చేసి అమ్ముతున్నారు. ముఖ్యంగా లారీల్లో వివిధ సరుకులను తీసుకెళ్తాంటారు. లారీల డ్రైవర్లు, క్లీనర్లు ఎక్కువగా హోటళ్లు, దాబాల్లో తింటుంటారు. వీరంతా స్థానికులు కాకపోవడంతో ఏది ఇచ్చినా తింటారన్న ఉద్దేశంతో యజమానులు వారికి నాసిరకం భోజనాలను ఇస్తున్నారు. నాణ్యతను పాటించని భోజన శాలలపై తనిఖీలు చేయాల్సిన ఫుడ్ఇన్స్‌పెక్టర్లు వాటిపై కన్నెత్తి చూడడం లేదు. గడిచిన దశాబ్ధ కాలంలో ఒక్క సారి కూడా ఫుడ్ ఇన్స్‌పెక్టర్లు తనిఖీ చేసిన దాఖాలాలు లేవంటే పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న హోటళు, దాబాలపై తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఖతర్‌లో ఘనంగా ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు

హైదరాబాద్, మార్చి13: ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు ఖతర్‌లో ఘనంగా నిర్వహించారు. దోహాలో జరిగిన జన్మదిన వేడుకల్లో టీఆర్‌ఎస్ ఖతర్ అధ్యక్షుడు శ్రీధర్ కేక్ కట్‌చేసి కవితకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. ఈనెల 14న జరగనున్న వరంగల్–ఖమ్మం–నల్లగొండ, హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. విద్యావంతులైన పల్లా రాజేశ్వర్ రెడ్డి, సురభీ వాణీదేవిలకు కుల, మతాలు, రాజకీయాలకు అతీతంగా ప్రథమ ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని కోరారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి పట్టంకట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం అధ్యక్షుడు మహేందర్ చింతకుంట, సీనియర్ నాయకులు శంకర్ గౌడ్, శంకరాచారి బొప్పరపు, అరుణ్ అలిశెట్టి, రాజేష్ నేత, కింగ్ రాజు తదితరులు పాల్గొన్నారు.



## పెట్రోల్, డీజిల్ రేట్లు తగ్గిస్తాం.. డీఎంకే

### ఎన్నికల మేనిఫెస్టో విడుదల



చెన్నై, మార్చి 13: తమిళనాడు ఎన్నికల్లో భాగంగా మేనిఫెస్టోను డీఎంకే పార్టీ విడుదల చేసింది. ఆ పార్టీ చీఫ్ ఎంకే స్టాలిన్ చెన్నైలోని డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో శనివారం మేనిఫెస్టోను విడుదల చేశారు. ఎన్నికల వేళ భారీగా వరాలు ప్రకటించారు. మేనిఫెస్టోలో సుమారు 500కుపైగా హామీలు ఇచ్చారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పెట్రోల్ రూ.5, డీజిల్‌పై రూ.4 తగ్గించనున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేస్తామని, పరిశ్రమలో తమిళులకే 75శాతం ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. మహిళలకు ప్రసూతి సెలవులు 12 నెలలకు పెంచనున్నట్లు ప్రకటించారు. నీట్ పరీక్షల రద్దుకు శాసనసభ తొలి సమావేశంలో ఆర్డినెన్స్ తేస్తామన్నారు. కార్మికులకు పాత పింఛన్ అమలు చేస్తామని, వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.100 రాయితీ ఇస్తామని, తమిళనాడు వ్యాప్తంగా కలైంజ్ఞర్ క్యాంటిన్లు ఏర్పాటు చేస్తామన్నారు.

విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధికి మేనిఫెస్టోలో ప్రధానం ఇస్తున్నట్లు తెలిపారు. అన్నాడీఎంకే మంత్రుల అవినీతిపై విచారణకు ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. హిందూ ఆలయాల పునరుద్ధరణకు రూ.వెయ్యి కోట్లు, మసీదులు, చర్చిల పునరుద్ధరణకు రూ.200 కోట్లు కేటాయిస్తానని వెల్లడించారు. ఆస్తి పన్ను పెంచబోమని, ఆవిన్ పాల ధర లీటర్‌పై రూ.3 తగ్గిస్తామని, 'తిరుక్కురళ్'ను జాతీయ గ్రంథంగా కేంద్రం ప్రకటించేందుకు కృషి చేస్తానని స్టాలిన్ హామీ ఇచ్చారు. అలాగే ప్రసిద్ధ దేవాలయాలకు తీర్థయాత్రలకు వెళ్లేందుకు లక్ష మందికి రూ.25వేలు ఆర్థిక సాయం, శ్రీలంక తమిళులకు పౌరసత్వం ఇచ్చేందుకు కృషి చేస్తానని ప్రకటించారు.

## లక్షమంది ఉద్యోగులకు వ్యాక్సినేషన్

### –ఖర్చును తామే భరిస్తామన్న హెచ్‌డిఎఫ్‌సి

ముంబై,మార్చి13(ఆర్‌ఎన్‌ఎ): లక్ష మంది బ్యాంకు ఉద్యోగులు వారి కుటుంబ సభ్యుల వ్యాక్సినేషన్‌ను స్పాన్సర్ చేస్తామని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ శుక్రవారం ప్రకటించింది. బ్యాంకు ఉద్యోగులకు కొవిడ్–19 వ్యాక్సిన్ రెండు డోసుల వ్యయాన్ని రీఎంబర్స్ చేస్తామని సంస్థ స్పష్టం చేసింది. తమ బ్యాంకులు, బ్రాంచ్ కార్యాలయాల్లో ఉద్యోగులు, కస్టమర్లకు సురక్షిత వాతావరణం కల్పించే దిశగా ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తామని, ఉద్యోగులు వారిపై ఆధారపడిన వారి వ్యాక్సినేషన్ వ్యయాన్ని భరిస్తామని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ పేర్కొంది. తమ ఉద్యోగుల సేవలకు కృతజ్ఞతగా ఈ నిర్ణయం తీసుకున్నామని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ హెచ్‌ఆర్ చీఫ్ వినయ్ రజ్దాన్ వెల్లడించారు. తమ సంస్థలో ఉద్యోగులు ఫ్రంట్‌లైన్ సిబ్బంది వంటి వారని లాక్‌డౌన్ సమయంలోనూ కస్టమర్లకు వారు బ్యాంకింగ్ సదుపాయాలను అందుబాటులో ఉండేలా వ్యవహరించారని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ గ్రూప్ హెడ్ అషిమా భట్ అన్నారు. తమ ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యం, భద్రత కోసం వారికి కొవిడ్–19 వ్యాక్సిన్ వ్యయాన్ని భరించేందుకు సిద్ధమయ్యామని చెప్పారు. ఇక ఐసీఐసీఐ బ్యాంక్, ఫ్లిప్‌కార్ట్, ఇన్ఫోసిస్, యాక్సెంచర్ వంటి భారీ కంపెనీలు సైతం ఇప్పటికే తమ ఉద్యోగులకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టేందుకు ముందుకొచ్చాయి.

## అక్రమంగా తరలిస్తున్న రూ.6 లక్షల విలువైన మద్యం పట్టివేత



రంగారెడ్డి, మార్చి 13: రెండు వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను హయత్‌నగర్ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకొని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కొహెడ్ ఔటర్ రింగ్‌రోడ్డు వద్ద జాతీయ రహదారి 65పై పోలీసులు తనిఖీలు చేపట్టారు. విజయవాడ వైపు వెళ్తున్న కారు, ఆటోలో 600 మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న దామోదర్, హరిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులను విచారించగా తెలంగాణలో మద్యం కొనుగోలు చేసి ఆంధ్రాలో విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు చెప్పారు. ఏపీతో పోలిస్తే తెలంగాణలో మద్యం ధరలు తక్కువ. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ. 6 లక్షల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు.

